క్లుప్తంగా

నేడు ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

బంగారుపాళెం: గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎన్.ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గాల వారీగా కన్వీనర్లు, కోకన్వీనర్లను నియమించి ఆ వివరాలను ప్రకటిస్తూ రాష్ట్ర పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు చిత్తూరు నియోజకవర్గ కన్వీనర్‌గా ఎన్. ఉదయ్ కుమార్‌రెడ్డి, కోకన్వీనర్లుగా ఎస్‌కేఎండీ యాసిన్‌సాదిక్, ఎ.భానుప్రకాష్‌ను నియమించారు.

దీనదయాళ్ సేవలు చిరస్మరణీయం

గుడిపాల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దీనదయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు సోమనాథగౌడ్ అన్నారు. గుడిపాలలో ఆదివారం దీనదయాళ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసంఘ్ అధ్యక్షుడిగా ఆయన పేదల సంక్షేమానికి ఎంతో కృషిచేశారని కొనియాడారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, నాయకులు సుభాష్, గోపి, దేవా, రవికుమార్, శేఖర్, ఏలుమలై, పెరుమాల్, సెల్వకుమార్, సాయిప్రతాప్ పాల్గొన్నారు.

నివాళి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల శ్రద్ధాంజలి ఘటించారు. సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి ప్రయోజనం చేకూరాలని దీన్‌దయాళ్ కృషి చేశారని స్మరించుకున్నారు. నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాసన్, కార్తికేయన్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు తప్పనిసరి

ఐరాల: వాహనచోదకులు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాచోదకుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. వాహనాలు అతివేగంగా నడపకూడదన్నారు. అనంతరం రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్టు, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి జబ్బులు ఉన్న రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి, చెన్నై శంకర్‌నేత్రాలయకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలోని నాంపల్లె జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన పాఠశాలకు సంబంధించిన రికార్డులు, మధ్యాహ్న భోజనం, ఎఫ్‌ఏ-3 పరీక్షల అమలును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మార్చి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను చదివించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

యువకుడికి గాయాలు



గాయపడిన హరికృష్ణ

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని ఐతేపల్లి సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు రూరల్ కొంగారెడ్డిపల్లెకు చెందిన హరికృష్ణ వ్యక్తిగత పనులు ముగించుకుని శనివారం ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు పయనమయ్యాడు. ఐతేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. హరికృష్ణకు కుడికాలికి తీవ్ర గాయమైంది. అతన్ని స్థానికులు 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అందరికీ సంక్షేమం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శనివారం మండలంలోని కీనాటంపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ గ్రామీణ ప్రజలతో మాట్లాడి మన రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎవరికైనా ఎటువంటి పథకాలు అందలేదంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు మాట్లాడుతూ సార్ గ్రామాల్లో సమస్యలు ఉన్నా ఎవరూ పట్టించుకునే వారు లేరు , సచివాలయ అధికారులకు, వలంటీర్లకు చెప్పినా ఎవరూ స్పందించడం లేదు సార్ అని ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్‌తో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉండాలని ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతి రోజు సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. స్పందనలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల కష్టాలను చూశారని, అందుకే నవరత్నాల పేరుతో ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, అందరికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ సురేష్‌బాబు, తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ శివరాజ్, అధికారులు, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్ , దానివేలు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మిస్తానని విశ్రాంత కలెక్టర్ హామీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థికసాయం అందజేస్తానని విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. గుడిపాల మండలం పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం శనివారం పిళ్లారికుప్పం గ్రామంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని ఆయన్ని కోరారు. దీనిపై స్పందించిన ఆయన కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో కొంతసేపు ముచ్చటించారు.

అమరుడు.. ఘంటసాల



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గుడిపాల: పద్మశ్రీ ఘంటసాల అమరుడని, ఆయన పాడిన పాటలు అజరామమని సీఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, తెలుగు అధ్యాపకులు అర్జున్ అన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘంటసాల పాటలు ఎవరు ఎన్ని పాడినా ఇంకా వినాలనే ఉంటుందన్నారు. ఏ కార్యక్రమమైనా వినాయకుని పూజ చేయడం ఎటువంటిదో, సంగీతానికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా ఘంటసాలకు పూలమాల వేయడం అటువంటిదనేనన్నారు. ఘంటసాల గీతాలను ఆలపించారు.

పల్లెలను బాగు చేసుకుందాం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు

చిత్తూరు రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పని చేసి పల్లెలను బాగు చేసుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు కోరారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వైస్ ఎంపీపీ జయరాం, రంజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ప్రధానంగా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెత్త సేకరణను విధిగా చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తే వెంటనే స్పందించాలన్నారు. రానున్నది వేసవికాలమని, క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: మండలంలోని పల్లెచెరువులో ఆదివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక పాల్గొని, 125 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పల్లెచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని వైద్య బృందం తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, జయమ్మ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ పద్మనాభపిళ్లై అన్నారు. శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో లిటిల్ రోజ్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చక్కగా చదువుకుని మంచి స్థాయికి చేరినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు సభికులను అలరించాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. ఎంఈఓ సెల్వరాజ్, పాఠశాల నిర్వాహకులు గోపాలకృష్ణమూర్తి, లోహిత్ కుమార్, రాధిక, పవిత్ర, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం



పలమనేరు: పట్టణ సమీపంలోని రొంటకుంట్ల రోడ్డులో వెలసిన రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అర్చకులు వెంకటేష్, నిర్వాహకులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక పోలీసులకు అప్పగింత



చిత్తూరు అర్బన్: తప్పిపోయిన ఆరేళ్ల బాలికను స్థానికులు శనివారం చిత్తూరు టూటౌన్ సీఐ మల్లికార్జునకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన షరీఫ్ కుమార్తె సన(6) చిత్తూరు నగరంలో తప్పిపోయింది. విషయం తెలుసుకున్న 31వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్, పోలీసు సిబ్బంది అక్బర్, వలంటీర హరీష్ పాప ఆచూకీ కోసం నగరమంతా వెతికారు. బాలికను గుర్తించిన అనంతరం ఎస్‌ఐ సమక్షంలో తండ్రికి చిన్నారిని అప్పగించారు.

ముమ్మరంగా పుష్పపల్లకి సేవకు ఏర్పాట్లు



దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లు

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామికి ఆదివారం నిర్వహించే పుష్పపల్లకి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏటా పట్టణంలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఆనవాయితీగా శ్రీవీరాంజనేయస్వామికి పుష్పపల్లకి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పట్టణమంతా విద్యుత్ లైట్లు, స్వామివారి ప్రతిరూపాలు, పుష్పాలంకరణతో ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈ పల్లకి సేవకు చుట్టుపక్కల వాసులే కాక ఇరుగు పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొంటారు. 13వ తేదీ సోమవారం రాత్రి శ్రీ వీరాంజనేయస్వామిని పుష్పపల్లకిపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తారు. పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు ప్రారంభిస్తారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మకర్త తెలిపారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న కాళబైరేశ్వర దేవస్థానం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తవణంపల్లెలోని కాళబైరేశ్వర దేవస్థానం ముస్తాబవుతోంది. ఈ నెల 16 నుంచి 22వ తేదీ బుధవారం వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి, ముస్తాబు చేశారు.

\- తవణంపల్లె



మానవ హక్కులపై అవగాహన

గంగవరం: ప్రతి గ్రామంలో మానవ హక్కులపై అవగాహన కల్పిస్తామని మానవహక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మునిరత్నం, వేలాయుధం తెలిపారు. శనివారం వారు మండలంలోని చిన్నమనాయనిపల్లి గ్రామం దళితవాడ ప్రజలతో సమావేశమయ్యారు. వారికి మానవ హక్కులపై అవగాహన కల్పించారు. నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.

ప్రేమలో ధనవంతుడిగా..

కోపంలో పేదవాడిలా ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు
- జాతీయ లోక్ అదాలత్‌లో 12,398 కేసులు గుర్తింపు



కక్షిదారులకు అవార్డులను అందజేస్తున్న జిల్లాప్రధాన న్యాయమూర్తి

చిత్తూరు అర్బన్: గుండె గుప్పెడంతే అయినా కొండంత ప్రేమను పంచగలమని, కుటుంబ వ్యవస్థలో బంధాలు బలపడాలంటే ప్రేమలో ధనవంతుడిగా కోపంలో పేదవాడిలా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఇ.భీమారావు అన్నారు. శనివారం చిత్తూరులోని జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్, ఆరో అదనపు జిల్లా జడ్జి ఎస్.శాంతి, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, మూడో అదనపు సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస్, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ కె.రవి, ఏఎస్పీ పి.జగదీష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సి.భానుశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.రాజేంద్రరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస మూర్తి, కక్షిదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టు వారి ఆదేశానుసారం జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మోటార్ వాహనాల కేసులు, రెవెన్యూ, వివాహ సంబంధ, ప్రీ లిటిగేషన్, తదితరాలు క్రింద 12,398 కేసులను గుర్తించామన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు, సమస్యలకు ప్రేమాభిమానాలతో ఆలోచిస్తే పరిష్కారం సులభంగా లభిస్తుందని, క్షణికావేశంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలు పరిష్కారం అవ్వతాయన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తూ సత్వర న్యాయం ఇస్తుందన్నారు. జిల్లా కోర్టుతో పాటు జిల్లాలోని 13 మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఏఎస్పీ జగదీష్ మాట్లాడుతూ నేషనల్ లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులు, కొన్ని క్రిమినల్ కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులు పై కోర్టులకు అప్పీలుకు వెళ్లడానికి వీలు ఉంటుందన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో సారా, మాదకద్రవ్యాలను వినియోగించడం కలిగే అనర్థాలపై అవగాహన కోసం పోలీస్ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సారా, గంజాయి, డ్రగ్స్ ఎక్కడైనా చలామణి అవుతుంటే వెంటనే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో భాగంగా కేసుల్లో రాజీ పడిన వారికి అవార్డులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా కక్షిదారులకు అందజేశారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ

- ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంఘమంలో ఉన్న కామాక్షంబదేవి సమేత ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. వేకువజామున ఆలయంలో స్వస్తివాచనం, గణపతి పూజ చేశారు. రాత్రి ఏడు గంటలకు వాస్తుపూజ, అంకురార్పణ నిర్వహించారు. అనంతరం దేవ దేవరులను పురుషామృగ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమాలకు యాదమరికి చెందిన అనసూయమ్మ, నారాయణ స్వామి, గుట్టకిందవూరుకు చెందిన పాండునాయుడు, కాశిరాళ్ల గొల్లపల్లెకు చెందిన ధనలక్ష్మి, బాలాజీ మండడి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు ధ్వజారోహణం

శ్రీ ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణం, ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారిని ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాహన సేవల వివరాలు

- ఈ నెల 13వ తేదీ ఉదయం 7 గంటలకు హంసవాహనం, రాత్రి 7 గంటలకు వృషభవాహనం
- 14న ఉదయం 8 గంటలకు సింహవాహనం, సాయంత్రం సప్పర ఉత్సవం, రాత్రి 7 గంటలకు శేషవాహనం
- 15న ఉదయం 8 గంటలకు అధికార నంది వాహనం, రాత్రి 7 గంటలకు నంది వాహనం
- 16న ఉదయం 8 గంటలకు భూత వాహనం, రాత్రి 7 గంటలకు కల్పవృక్ష వాహనం.
- 17న ఉదయం 8 గంటలకు కామధేను వాహనం, రాత్రి 7 గంటలకు ఆదిశేష వాహనం.
- 18న శివరాత్రి సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి పూజలు నిర్వహించనున్నారు.
- 19న ఉదయం 8 గంటలకు యాళివాహనం, రాత్రి 7 గంటలకు నెమలివాహనం
- 20న ఉదయం 8 గంటలకు అశ్వవాహనం, మధ్యాహ్నం 2 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, రాత్రి 7 గంటలకు గజవాహనం
- 21న ఉదయం 8 గంటలకు రథోత్సవం, సాయంత్రం 4 గంటలకు త్రిసూల స్నానం, రాత్రి 7 గంటలకు కలియుగ రావణబ్రహ్మ వాహనం.
- 22న ఉదయం 8 గంటలకు పుణ్యకోటి విమానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం, రాత్రి 8 గంటలకు పల్లకి సేవతో బ్రహ్మోత్సవాలు ముగింపు.

శ్మశాన కొల్లను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: శివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన జరిగే శ్మశానకొల్ల(మయానసేవ)ను విజయవంతం చేయాలని అంకాళపరమేశ్వరి ఆలయాభివృద్ధి ట్రస్టు నిర్వాహకులు కుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరు, గురప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆ నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఆలయంలో శివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీన శ్మశానకొల్లను ఘనంగా నిర్వహిస్తామన్నారు. భూతవాహనంపై అమ్మవారు ఊరేగుతూ నీవానదికి చేరుకుంటారన్నారు. అక్కడ అమ్మవారికి విశేష పూజలు చేస్తామని చెప్పారు. అనంతరం నగర వీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. మయాన సేవ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. తదనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అర్చకులు కుమార్, మయానసేవ ఉత్సవ కమిటీ సభ్యులు సురేష్, వినోద్, అరుల్ కుమార్, ముత్తు, వేలాయుధం, పెరుమాళ్, వేలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అల్లిక.. ఆదరణ లేక..

- ఆధునిక పరికరాలతో పనులు కరువు
- ఇబ్బందుల్లో కార్మికులు



గట్రాళ్లమిట్టలో వెదురుబుట్టలు అల్లుతున్న కార్మికులు

గుడిపాల: వ్యవసాయం ఒకప్పుడు వెదురుతో చేసిన పనిముట్లపై ఆధారపడి సాగేది. రైతులు వ్యవసాయ పనుల్లో వెదురుతో చేసిన నాటు బండి జల్లలు, వడ్ల గంపలు, బుట్టలు, తట్టలు, చాటలు ఉపయోగించేవారు. వ్యవసాయంలో ఆధునిక పరికరాలు రావడంతో నేడు ఆ పనిముట్లతో అవసరం లేకుండా పోయింది. ఫలితంగా వెదురుతో వివిధ రకాల పనిముట్లు తయారు చేసే కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారింది. దీంతో పలువురు వృత్తిదారులు వలస వెళ్లి వేరే పనులు చేసుకుంటున్నారు. గుడిపాల మండలంలో గట్రాళ్లమిట్ట, అనుపు, పెరుమాళ్లకుప్పం, పానాటూరు ప్రాంతాల్లో వెదురు పనిముట్ల తయారీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనుల్లో రైతులు వెదురు పనిముట్ల వాడకపోవడంతోపాటు వెదురుబొంగుల రేటు విపరీతంగా పెరగడంతో వీరి జీవనోపాధికి విఘాతం కలిగింది. తాజాగా ఒక్కొక్క వెదురుబొంగు సైజును ఆధారంగా రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఒక వెదురుబొంగుతో సుమారు అయిదు నుంచి ఆరు బుట్టలు తయారు చేస్తే రోజు మొత్తం మీద రూ.300 నుంచి రూ.350 మాత్రమే గిట్టుబాటు అవుతోంది. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు దృష్ట్యా కూలి గిట్టుబాటు కావడం లేదని వెదురు ఉత్పత్తుల తయారీపై ఆధారపడిన కార్మికులు వాపోతున్నారు. దీనికి తోడు గతంలో వ్యవసాయంలో వాడే నాటు బండి జల్లలు, వడ్ల గంపలు, బుట్టలు, తట్టలు, తడికెలు, చాటల వినియోగం తగ్గిపోవడంతో బుట్టల అల్లిక మాత్రమే కొనసాగుతోంది. దీంతో ఈ వృత్తిపై ఆధారపడిన వారు బుట్టల తయారీని వదలి ఇతర పనులకు వెళుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు ఉపాధిని చూపించాలని వారు కోరుతున్నారు. వెదురు అల్లికలపై ఆధారపడిన కుటుంబాలకు వెదురు బొంగులను రాయితీపై ప్రభుత్వం ఇప్పించాలని కోరుతున్నారు. నిరుపేద కుటుంబాలకు రాయితీతో కూడిన రుణాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కుటుంబం గడవడం లేదు



ఊహ తెలిసిన నాటి నుంచి ఈ వృత్తిలో కొనసాగుతున్నాను. వేరే వృత్తి తెలియదు. 365 రోజులు బుట్టలు అల్లే పనిలో ఉంటాను. పెరిగిన వెదురు ధరలు, నిత్యావసర సరుకుల ధరలతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ప్రభుత్వం వెదురు బుట్టల అల్లకందార్లను ఆదుకోవాలి. – వేలు, గట్రాళ్లమిట్ట